# 32. ఎక్స్‌కర్షన్

'ఎక్స్‌కర్షన్' అంటే యేమిటో తెలియని ఆ హైస్కూల్లోని విద్యార్థులకు, ఎక్స్‌కర్షన్ అంటే ఆశ్చర్యంగా వుండదూ? అందులో చరిత్రాత్మక స్థలమయిన కొండవీటికి ఎక్స్‌కర్షన్ అంటే ఇంకెంత ఆశ్చర్యంగా ఉండాలి?

అసలు, ఆ హైస్కూల్లో యేమాస్టరుకూ ఎక్స్‌కర్షన్ వెళ్దామని వుండేదికాదు. ఇంక విద్యార్థులకు వుండే ఉత్సాహాన్ని మీరే ఆలోచించుకోండి! ఏదో – 'గుడ్డిలోమెల్ల' అన్నట్టు అక్కడి మాస్టర్లలో కొంచెం మెరుగు ఒక లెక్కల మాస్టారు. ఈయనకు 'ఎక్స్‌కర్షన్' అంటే కొంచెం ఉత్సాహమే – కాని, ఆయన ప్రయత్నం తక్కిన మాస్టర్లవల్లా – ప్రత్యేకం హెడ్ మాస్టారువల్ల – ఆగిపోతూ వుండేది కాని, ఆనాడు – దైవవశాత్తునో, ఖర్మవశాత్తునో అది కొనసాగింది!

మొదట కొండవీడు ఎక్స్‌కర్షన్ వెళ్తే బాగుంటుందని యీ మాస్టారు సజెస్టు చేశారు. దాంతో హెడ్‌మాస్టరుకు ఎలక్ట్రిక్ షాక్ తగిలినంత పనయింది. "ఎందుకొచ్చిన ఎక్స్‌కర్షన్ లంటే? తినికూర్చోలేక లేనిపోయింది నెత్తిన తెచ్చిపెట్టుకోవటం ఎందుకు? అందులో పిల్లలతో వ్యవహారం – పిల్లులతో చలగాటాల్లాంటిది. వాళ్లు యే చిలిపి చేష్టలు చేసినా ముందు మనకొస్తుంది. వాళ్లల్లో ఎవళ్లయినా తప్పిపోతే ఎంత అవస్తో చూడండి. కాబట్టి మీ ప్రయత్నం మానుకోమని నా సలహా!" అని హెడ్ మాస్టారన్నారు. ఇదిచూస్తే నాకు, బలిచక్రవర్తి దానానికి శుక్రాచార్యుడు అడ్డుపడ్డఘట్టం జ్ఞాపకాని కొచ్చింది.

మా హెడ్ మాస్టార్ని మీరు ఎరుగరు కాబోలు! సూక్ష్మంగా వర్ణిస్తా – తమిళమనిషి, పొట్టిగా దొండకాయలాగుంటారు. గుమ్మడి కాయలాంటి ముఖం. ఇంతమటుకూ చాల్లెండి. ఆయనకు తెలుస్తే ఏమన్నా అంటాడేమో!

హెడ్‌మాస్టారు చెప్పిన మాటల్లో నిజం ఎంతో చూద్దాం. ఆయన 'పిల్లలు' అని వాడిన పదం నాకేమీ బాగుండలేదు. ఏమంటారా ఆ హైస్కూల్లోని విద్యార్థులందరూ మేజర్లే! ఎవరయినా తప్పిపోతారుట! ఈమాట ఈయన అనుభవంలోదేననుకుంటా – ఏమంటారా, ఎప్పుడన్నా కొడుకు సినిమాకు వెళ్తే (మొదటి ఆటకు) ఈయన లైటుపుచ్చుకొని హాలు దగ్గరకు తయారయ్యేవాడు. కాని అచ్చోసిన ఆంబోతుల్లాంటి యీ వానరసేనకు భయమేమిటండీ?

మఱి మా మాస్టారు వూరుకునే రకంకాదు కదండీ! మఱోసారి ప్రయత్నిద్దామనుకొని (రాబర్ట్‌బ్రూస్ కథ ఈయనక్కూడా తెలుసులెండి!) "మఱేం ఫరవాలేదు; నేనువున్నానుగా!" అన్నారు. మొహమాటంవల్ల హెడ్ మాస్టరు, "సరే! అంతా మీదే జవాబుదారీ" అని నీళ్లు నమిలాడు.

ఇంక క్లాసుల్లోకి నోటీసు వచ్చింది కొండవీడు ఎక్స్‌కర్షన్‌కు వచ్చేవాళ్లను రమ్మని. మల్లయ్య కొట్లో సిగరెట్లు ఖాతా తీరలేదే – మనకు ఎక్స్‌కర్షన్ ఎందుకూ అనే బాపతుకొంత, రేపు సబితాదేవి పిక్చర్‌కు వెళ్లేందుకు డబ్బులేదు ఎక్స్‌కర్షన్ మానుకుంటేనేం – అనే బాపతు కొంత కాఫీ హొటల్ బాపతు బాకీ ఇవ్వకపోతే అయ్యర్ దేహశుద్ధి చేస్తాడేమోననే బాపతుకొంత. మార్కండేయులు దబాయించాడు (పూర్వం మార్కండేయులు యముడ్ని దబాయించలా?) రెండురోజుల్లో నన్నా వాడి డబ్బివ్వకపోతే ఇంటి కొస్తాడేమోనని భయపడేబాపతు కొంత ఇవ్విధంబున 99.9% తప్పుకున్నారు. ఇంక మిగిలిన 1% అంటే వీళ్లు కొంచెం సరదా, జల్సా పురుషులు సిద్ధమయ్యారు. మాస్టర్లందరూ యీ డిప్రెషన్ కాలంలో ఇన్‌క్రిమెంట్లు లేవని వూరుకున్నారు.

❋ ❋ ❋

అంతా ఒక డజనున్నరమంది ఎక్స్‌కర్షన్‌కు తయారయ్యారు. గురువారంనాడు సాయింకాలం అంతా స్టేషన్‌కు వెళ్లాం. హెడ్ మాస్టారు కూడా వచ్చారు – క్రొత్తగా కాపరానికి వెళ్లే కూతుర్ను దిగపెట్టే తరహాలో.

ఆ బండిలో పడి రాత్రి 7–44కు గుంటూరు జేరాం. మా లెక్కల మాస్టారు గుంటూరులో బేవార్సుగావచ్చే ఇల్లోటి సంపాదించారు. బళ్లల్లో సామానువేసుకొని మేమందరమూ ఆ ఇల్లుజేరుకున్నాం. ఇల్లు బాగానే వున్నది: నాలుగు గదులు, గదికో ఎలక్ట్రిక్ లైట్, కిరసనాయల్ ఖర్చుకూడా తప్పినందుకు సంతోషించాం. ఒక గదిలో మాస్టారు, మరి ముగ్గురు ప్రియశిష్యవర్గం, మఱోగదిలో దమ్ముగాళ్లు. ఇంకోగది పేకాటకు, నాలుగో గది చేచేకు.

ఆ రాత్రి గాలి జోరుగా వుంది. వర్షం కొద్దిగా కురిసింది.

తెల్లవారింది. శుక్రవారం అన్నమాట. గాలి వాన తగులుకుంది. హెడ్ మాస్టారి దీవనే ఇంత పని చేసిందనుకున్నాం. ఆ గాలివానను చూస్తే మా ఆశాదీపం కాస్తా ఆరిపోయింది. ఇంక తోక ముడవవచ్చుననుకున్నాం.

పదింటికి వానలో తడుస్తూనే వెళ్లి భోజనాలు చేసివచ్చాం. గాలి తన బలాన్నంతా చూపిస్తోంది, కట్టుకున్న గూడు కట్లుకొట్టుకు పోయ్యేట్టు, ఆ పూటకు అల్లాగే అవస్థపడ్డాం.

ఆ రాత్రి -

నాన్‌రొట్టెలు తెప్పించారు డబ్బు ఖర్చు తప్పుతుందని. అందర్నీ అవి తిని పడుకోమన్నారు. కాని వాములు కావాల్సిన స్వాములవారికి పచ్చిగడ్డి ఫలహారమా? ముగ్గురం మాత్రం కూడు కావాలన్నాం. మాస్టారు విసుక్కుంటూ డబ్బిచ్చారు. తడుస్తూనే వెళ్లి కూడుతినివచ్చాం.

❋ ❋ ❋

శనివారం ప్రొద్దున-

అదృష్టం అంటే అల్లా వుండాలి. గాలివాన తగ్గింది. ఇకేం - బయలు దేరుదామంటే బయలు దేరుదామనుకున్నాం. తలా ఓ బేడా అర్ధణాకు (అంతా జపాన్ వస్తుసముదాయం కాదండీ! - ఏవస్తువైనా బేడా అర్ధణే!) తొక్కేశారు. మెల్లిగా స్టేషన్‌కు జేరాం.

మాస్టారు చూడకుండా దమ్ములాగే బాపతు హిగ్గిన్‌బాథమ్స్ దగ్గరజేరింది. వాళు తమ పనేదో చూసుకుపోగూడదూ? అక్కడవుండే పుస్తకాల్ని - అంతా వీళ్లబాబుగాడిసొమ్ము దాచిపెట్టినట్టు - తెరుస్తారు. కొనేదిలేదు సుమండి. ఇటువంటి విషయాల్లోమాత్రం 'ఎకానమీ' అబ్జర్వ్ చేస్తారు. ఆ హిగ్గిన్ బాథమ్స్‌వాడు పొమ్మనేదాకా కదలరు.

ఈలోగా మా మాస్టారు ఓ నాలుగు డజనుల నారింజపళ్లు కొన్నారు. క్రిందటి రోజున కొట్టిన గాలివానకు రాలినబాపతు పళ్లవటంచేత మహా చౌకగా వచ్చాయి. అన్నీ ఒకమూట కట్టి ఒకడి నెత్తిన పెట్టారు. నా నెత్తిన పెడతారేమోనని నేను తప్పుకున్నాలెండి!

❋ ❋ ❋

రైల్లోపడి మెల్లిగా ఫిరంగిపురం స్టేషన్ జేరాము.

ఊళ్లోకి వెళ్లి ఒకసత్రంలో యీ పద్దెనిమిది మందికీ భోజనం తయారు చెయ్యమని ఆర్డరిచ్చాము - డబ్బిచ్చే పద్ధతిలోనే సుమండి!

ఆ వూరు కొంచెం ఎరిగిన ఒక కుర్రవాడు వెళ్లి, కొద్ది పరిచయం వున్న ఒకడ్ని కొట్టుకు వచ్చాడు - మాకు దారిచూపేందుకు.

మెల్లిగా త్రోవనుపడ్డాం. ఆ పొలాల్లోవున్న గులకరాళ్లు గుచ్చుకుంటుంటే మా ముత్తాతలు జ్ఞాపకానికొచ్చారు. తప్పేదేముంది? అల్లాగే ఆ క్రొత్త వ్యక్తి వెనకాల గుడ్డెద్దులు చేలోబడ్డట్టు నడుస్తున్నాం.

కుఱ్ఱకారు – వూరుకుంటుందా? ఆ పొలాల్లోంచి ఒక ఆంబోతు వెళ్తోంది. దాన్ని గోల చేశారు. అదిమాత్రం తక్కువ తిన్నదా? ఇకేం – అది మా వెంటపడ్డది. ఒక్కొక్కళ్లు మైల్ రేస్ ప్రారంభించారు. ఇల్లా ఎంత దూరం పరుగెత్తామో మాకు తెలియదు. ఈ పరుగెత్తినంతసేపూ వెనక్కు తిరిగి చూచినవాళ్లు ఒకళ్లూ లేరు. చివరను ఆంబోతుకు విసుగెత్తో, దయ కలిగో – తోక ముడిచింది.

ఇక మన ఆంబోతులు – ఆయాసం తీర్చుకుంటూ నాలుగు మూలలకూ పరుగెత్తినవాళ్లు మళ్లా ఒకచోట జేరేప్పటికి ఒక అరగంట పట్టింది. మా మాస్టారు ఆ ఘట్టం కొండమీద జరిగివుంటే యీ పాటికి స్వర్గంలోవున్న హైస్కూలుకు మూటలు కట్టివుండేవాళ్లమని అన్నారు.

ఆ నూతనవ్యక్తి "ఈ కొండల మీద పాములు...పాములేమిటి?...కొండ చిలువలున్నాయి. ఒక్క కొండచిలువ బాగా గాలి పీల్చిందంటే భారీమనుష్యులు ముగ్గురు ఏక్ దమ్మున దాని కడుపులోకి కాపరానికి వెళ్తారు; మొన్న ఒక ఆవును అమాంతంగా అప్పలించింది. చాలా జాగ్రత్తగా వుండాలి" అని హెచ్చరించాడు.

మాలో చాలామందికి చచ్చినపామంటేనే భయం. కొండ చిలువ లనేప్పటికి మా గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి అందులో మాకు సమీపంలో ఒక బారెడు పొడవు పాము చచ్చిపడివున్నది. దాన్ని చూసేప్పటికి మాకు చాలా భయం వేసింది. దాన్ని దగ్గరకువెళ్ళి చూడగల మగవాడెవడు? ఒకళ్లముఖం వంక ఒకళ్లం చూచుకున్నాం. చివరకు మాకు దారి చూపేవాడు భయపడుతూనే వెళ్లి చూసి – చచ్చినపామని చెప్పాడు. ఇంకా మాకు అనుమానమే! ఎట్లాగో ఒకళ్ల కొకళ్లం ధైర్యం చెప్పుకొని వెళ్లి చూశాం. ఆ పెద్ద పామును చూసేప్పటికి బ్రతికివుంటే బలుసాకైనా తినవచ్చు' వచ్చిన త్రోవ పడ్దాం అనుకున్నాం; కాని హైస్కూల్లో డంబాలుకొట్టివచ్చి ఏమీ చూడకుండా వెళ్తే ఉత్తరకుమారుల టైటిల్ తగులుతుందని దడిసి ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని – ముందుకుసాగాం.

ఒకళ్లకొకళ్లం ధైర్యం చెప్పుకుంటూ, "చెట్టు దాటి, పుట్టదాటి అన్నట్టు పొలాలన్ని దాటి కొండ ఎక్కడం ప్రారంభించాం. పడుచువాళ్లం కాబట్టి కొంచెం జోరుగానే ఎక్కుతున్నాం. మా మాస్టారు – సుమారు ఒక అర్ధశతాబ్దపు మనిషిలెండి మెల్లిగా మోటర్ గేజి గూడ్సులాగు ఎక్కి వస్తున్నారు. మాకూ మా మాస్టారికీ సుమారు 100 గజాల దూరం వుంటుంది.

మధ్యలో ఇరుప్రక్కలా పుల్లరేగి చెట్లు వున్నాయి. ఆ పళ్లు కోసుకు తినటం ఆరంభించాం. అటువంటి పళ్ళచెట్లే మజోరకంవి వున్నాయి. ఆ పండుకూ, యీ

పండుకూ రుచిలో తప్ప వేతే భేదమేమీ లేదు. ఇవ్వే పుల్ల రేగని తిని నోరంతా ఖరాబ్ చేసుకున్నాడు మాలో వొకడు.

మాలో గున్నేశ్వర్రావని ఒకడున్నాడు. గున్న మామిడి చెట్టులాగు పొట్టిమనిషి. వీడు మూడో ఛాన్స్ పబ్లిక్ పరీక్షకు వెళ్లాల్సినవాడు. నేనను కుంటాను - బెనారస్ యాత్ర వీడికికూడా తగులుతుందని. వీడికి నత్తి. ఈకలు పెరికిన కోడిలాగు సన్నగా వుంటాడు. వీడ్ని 'పేర్' అని పిలుస్తూ వుంటాము. వీడికి అమితమయిన భయం. సినిమాకు వెళ్తే ఒక్కడూ ఇంటికి రాలేడు. అందుకని ఎవర్నన్నా డబ్బెట్టి కూడా తీసుకువెళ్తూ వుండటం వీడికి రివాజయింది.

ఈ 'పేర్' గాడు ముందెప్పుడూ నడవడు. మధ్యలో వుంటాడు. ముందుకు నడుస్తున్నవాడు 'పాము' అని కేకవేశాడు. మన పేర్‌గాడు వెనక్కు దిగటం ప్రారంభించాడు. మెల్లిగా వెళ్ళి చూస్తే అది పాము కాదు....ఒక పెద్ద గుడ్డ పేలిక. మళ్లా పేర్‌గాడు గ్యాంగ్ మధ్యలోకి ఇరుక్కున్నాడు.

ఆ ఇరుకు త్రోవల్లో పడి నడుస్తూవుంటే ఇటుప్రక్క ముళ్లూ, అటు ప్రక్కముళ్లూ మా బట్టలకు పట్టుకొని పంచర్లూ, ఒరెస్లూ తయారుచేశాయి ఎక్స్‌కర్షన్‌లో వుండే సుఖం మా జన్మజన్మాలకూ మరుపురాకుండా. ప్రక్కనున్న పొదల్లో ఏముందో చూసేందుకూ భయమే! ముందుదారి చూడకుండా నడుస్తే కాలుజారి దొల్లుపుచ్చ కాయలాగు క్రిందికి దొల్లుతామోననీ భయమే! ఇల్లా అష్టకష్టాలు పడుతూ కొండ ఎక్కుతూనే వున్నాం.

❋ ❋ ❋

"రాజుగారికోట అదుగో!" అని మాకు దారిచూపేవాడు చూపించాడు. ఎక్కడో ఆకాశాన్ని అంటుతూన్నట్టువున్న ఆ శిధిల మందిరాన్ని చూశాం. దాని దగ్గరకు వెళ్ళి చూడాలని మాకు వుత్సాహం ఎక్కువయ్యింది. నడక జోరుచేశాం. పైకి వెళ్లి ఆ కోట అంతా చూశాం. చాలా బాగా వున్నది. ఎండ తక్కువగావున్నా అక్కడో ఫొటో ఎత్తాం. అక్కడ్నించి క్రిందికి చూస్తే క్రిందనున్న పొలాలన్నీ - ఒక గ్రాఫ్ పేపర్ పరిచినట్టుగా కనిపించాయి.

ఆ కొండదిగాం. మఱోకొండ. ఇందాకటిదానికన్న ఇది ఎత్తు. ఇందులో ఒక బంగళా ఏమంత గొప్పది కాదులెండి. మావూర్లో వున్న ట్రావిలర్స్ బంగళాలాంటిది. అక్కడో మజిలీ వేసి పుల్లనారింజకాయల్ని భుజించాం. ఈ మాటు యే పుష్కరానికన్నా మీరు వెళ్లటం తటస్థిస్తే మేమిక్కడ విసర్జించిన నారింజ గింజలు - పెద్దతోటగా తయారవుతాయేమో చూడండేం?

ఇంక రాజుగారి ధనాగారం. డబ్బేమీలేదు లెండి! పెద్దభోషాణ్నాల్లాంటి రెండు గోతులు (సిమ్మెంటుతో కట్టినవి) అవి సుమారు ఒక 20 అడుగుల లోతు గలవి.

అగ్గిపుల్లలు వెలిగిస్తే కాని లోపలవున్న మన్నూ మశానమూ కనిపించలా. ఇదయ్యాక రాణిగారి మందిరము. ఒక మసీదు లాగుంది. ఇందాకటి బంగళాకు ఇది రెండు ఫర్లాంగుల దూరంలో వున్నది. కాని నాకొక్క అనుమానం - రోజూ రాజుగారు యీ మోకాటి పర్వతాన్నెక్కి రాణిగారి దర్శనం ఎల్లా చేసేవాడో?

ఇదయ్యాక మఱోకొండ దాటాం. నేనెప్పుడూ తిరుపతి కొండ ఎక్కలేదు కాని - మా ముసిలిది మోకాటిపర్వతం సంగతి చెప్తూ వుండేది. ఆవిడ యీ పర్వతాన్ని ఎక్కి వుంటే - దీన్ని మోకాటి పర్వతమేమికర్మం? కాళ్లపర్వతం అని వుండేది. నున్నగా గ్లోబులాగవున్న ఆ పెద్ద బండల మీద దేకుతూవుంటే (కాలుజారుతే పాతాళానికి జారుతామని) ఒకళ్లను చూసి ఒకళ్లం నవ్వుకున్నాం.

ఈ కొండదాటి ప్రక్కనేవున్న 'వెదుళ్ల చెరువు' దగ్గరకు వెళ్ళాం. ఇప్పటికి సుమారు ఒంటిగంట అవుతుంది. మేము బయలుదేరి అప్పటికి అయిదుగంట లయిందన్నమాట. పేర్‌గాడు, మఱో ఇద్దరూ నడవలేకపొయ్యారు. మేము ఆ చెరువు అంతా చుట్టివచ్చాం. చెరువు తీరాన్న అన్నీ వెదురు పొదలున్నాయి. ఈ లోపల మా ముగ్గురు చేసిన పనియేమిటంటే - నాలుగు వెదురు బెత్తాల్ని కోశారు. ఈ కొయ్యటంలో అందరూ తమ వ్రేళ్లనుకూడా కోసుకున్నారులెండి. ప్రక్కనేవున్న తమ్మకాయల్ని చాలా శ్రమతో కోశారు - ఇంటి దగ్గర అందరూ కూరవండుకుందామని. కానీ, అవ్వి పిచ్చితమ్మకాయలని అక్కడ ఎవరో చెప్పబట్టి సరిపోయింది కాని - లేకపోతే ఆ కూరతిని - మేమందరమూ యీ పాటికి పిచ్చివాళ్లమయి - గుడ్డలు లేకుండా మావూరి వీధుల్లో షికార్లు మొదలుపెట్టి వుండేవాళ్లం.

మేము కొండమీద చూసినవన్నీ ఇవ్వే. చూసినవన్నీ ఫోటోలు తీశాము కాని ఒక్కటీ సరిగ్గారాలేదు. పూర్వం శ్రీకృష్ణదేవరాయలంతటివాడు కొండవీడు పాలిస్తూవున్న రెడ్లను గెలువలేకపొయ్యాట్ట. ఈ మోకాళ్ల పర్వతాల్ని చూసేప్పటికి ఆయనక్కూడా తారెత్తి వుంటుంది. అందులో కొండచిలవలున్న ప్రదేశం కాబట్టి సైనికులు కూడా దడిసి వుంటారు. కాని ఆనాడు - మా మాస్టారనే కృష్ణదేవరాయలు హైస్కూలు రాయుళ్లనే (అందరూ రావులేనండి - ఈ రావులకు యేమీరావని వేరే చెప్పాలా?) సైనికులతో పర్వత, వన, జల విహారాదుల్ని సలిపారు.

ఇంక పర్వతం దిగటం-ఎక్కేప్పుడు తాతలు జ్ఞాపకానికి వస్తే-ఇప్పుడు ముత్తాతలు అంతకుపైవాళ్లూ జ్ఞాపకానికి వచ్చారు. బ్రేకులు లేని సైకిళ్లలాగు కాళ్లో ముల్లు గుచ్చుకున్నా ఆగేందుకు వీల్లేదాయెను. అవస్థలు పడుతూ పర్వతం దిగి వచ్చేప్పటికి తలప్రాణాలు తోకకు వచ్చాయి. దీనితో హరిశ్చంద్రుళ్లలాగు తయారయ్యాం. లోపలి ఆకలి ఎక్కువయింది. గొడ్లమన్నా అయితే అక్కడ పచ్చిక తినివుండేవాళ్లం. పక్షులమన్నా అయితే అక్కడి పళ్లే మన్నా తినేవాళ్లం. కాని మనుష్యులమయిపొయ్యాం - ఖర్మం.

❋ ❋ ❋

మేము పర్వతంక్రింద చూచింది మరోటి వుంది. అది చీకటి కోనేరు. దాని పూర్వగాథ ఏమిటంటే-

కృష్ణదేవరాయలు రెడ్డిరాజుల కాలంలోని పర్వతంమీద ఇందాక మాబట్టలకు పంచర్లు పడుతే, ఇప్పుడు మాకాళ్లకు పంచర్లుపడ్డాయి. అల్లా మజిలీలు వేసుకుంటూ సత్రం జేరుకున్నాం.

ఇప్పటికి సుమారు 2-30 అవుతుంది. పాపం సత్రం అవ్వ డబ్బాశచేత కూడు రెడీగా వుంచింది. ఆ పుల్లరేక్కాయలు మాతో తెచ్చిన పుల్ల నారింజ కాయలు మేళవించి ఖరాబ్ చేసిన మా నోళ్లను ఆ దిగుడు బావుల్లో వున్న ఉప్పునీళ్లతో కడుక్కున్నాం అంతశ్రమతోవచ్చిన మేము పప్పు వాయలలో ఆవకాయత్రొక్కి నోటికి అందిస్తుంటే, కైబర్ ప్యాస్, బొలాన్ ప్యాస్‌ల్లోపడ్డ ఆంగ్లసైన్యాల్లాగ ఒక్కొక్క ముద్దే మానోళ్లల్లోంచి కడుపుల్లోకి జారాయి. భోజనం అంతా అయ్యాక సత్రం అవ్వ మావైపో చూపు చూసింది. ముడుపు చెల్లించాము. గుంటూరు వచ్చే మిక్స్‌డ్‌లోపడి - చావుతప్పి కన్ను లొట్టపోయినట్టు - ప్రేతముఖాల్తో ఇళ్లు జేరుకున్నాము. గాలివానలో కొట్టుకుపొయ్యామనుకున్న మా హెడ్ గెలువలేక ఒక బ్రాహ్మణుడికి లంచమిచ్చాడు. ఆ బ్రాహ్మణుడు రెడ్డిరాజులకు పూజారి. రాయలుదగ్గర పుచ్చుకున్న డబ్బులో కొంత ఖర్చుచేసి ఒక గుడిని కట్టించాడు. ముందు ఒక పెద్ద హాలు లోపల ఒక చిన్నహాలు; ఇంకా లోపల ఒక పెద్దకోనేరు. దాని తరువాత గుడి. మొదటిహాలు దాటంగానే అమావాస్య తయారు. ఇదీ అక్కడి అరేంజిమెంటు. ఆ బ్రాహ్మణుడు, ఆ రెడ్డిరాజుల్ని భోజనానికి పిలిచి, మొదటి హాలులో ఆతిథ్యమిచ్చి, "లోపల దేవుడున్నాడు; ఒకరి తరువాత ఒకరు వెళ్లి దర్శనం చేసి ఆ దొడ్డిత్రోవను వెళ్లమని" చెప్పాడుట, ఒకరి తరువాత ఒకళ్లువెళ్లి, కోనేటిలోపడి - దేవుడ్ని చూసేందుకు వెళ్లారుట. ఇదీ కథ.

అయితే మాకు కూడా ఆ రెడ్డిరాజుల గతి పడుతుందేమో ననుకున్నాం. కాని, ఆ కోనేరు పూడ్చేశారు. ఎన్ని అగ్గిపుల్లలు వెలిగించి చూసినా ఏమీ కనబడలేదు. ఇక వెనక్కు తిరిగిరావటం ప్రారంభించాం.

❋ ❋ ❋

"ఇది దగ్గరిత్రోవ"ని మాకు దారిచూపేవా డొక త్రోవచూపాడు. ఒక ఫర్లాంగుదాటగానే ఆ త్రోవలో పల్లేరు మాస్టారు మమ్మల్నిచూసి ఆశ్చర్యపొయ్యాడు. మేముకూడా ఆయన్ను చూసి ఎడ్వంచర్ చేసివచ్చిన యులిసెస్‌లాగు రొమ్ములు విరిచాం!!!

*- వాహిని, 19 మార్చి, 1939*